క్లుప్తంగా

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో రెండో విడత అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ పి.పరమేశ్వరరావు తెలిపారు. విద్యార్థులు **iti.ap.gov.i n** వెబ్‌సైట్ ద్వారా బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని రశీదు పొందాలన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 31వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ ఐటీఐకు దరఖాస్తు చేసుకున్న వారికి 3, 4 తేదీలలో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటీఐలో, ప్రైవేటు ఐటీఐలను ఎంపిక చేసుకున్న వారికి 5, 7 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

లారీ డ్రైవర్‌పై దాడి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ మంగాదేవి

ధవళేశ్వరం: లారీ డ్రైవర్‌పై దాడి చేసి రూ.33 వేలు దోచుకెళ్లిన ఘటన ధవళేశ్వరం ఇండస్ట్రియల్ కాలనీ సమీపంలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. బొమ్మూరుకు చెందిన పేరవరపు సాయి సోమవారం ఇసుక లోడ్‌తో పెద్దాపురం వెళ్లాడు. తిరిగి ఇసుక లోడ్ కోసం ధవళేశ్వరం వస్తుండగా అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో రెండు ద్విచక్రవాహనాలతో వచ్చిన ముగ్గురు దుండగులు లారీని అడ్డగించారు. లారీ డ్రైవర్‌పై దాడి చేసిన అతని వద్ద ఉన్న రూ.33 వేలు దోచుకెళ్లారు. గాయపడిన లారీ డ్రైవర్ సాయి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసును క్రైం ఏఎస్పీ వెంకటేశ్వరరావు, సౌత్ జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ధవళేశ్వరం సీఐ కె మంగాదేవి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవం

కంబాలచెరువు: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా స్థానిక వై.జంక్షన్ నుంచి ప్రభుత్వ ఆస్పత్రి వరకు జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ, లింగ సమానత్వం, పేదరికం, మాతృ ఆరోగ్యం, మానవ హక్కులు మొదలైన వాటిపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, జిల్లా గణంకాధికారి కుమారస్వామి పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతం కావాలి

రాజమహేంద్రవరం సిటీ: 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారం చేపట్టాలంటే పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని సోము వీర్రాజు అన్నారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులుగా నియమితులైన ఆయన మంగళవారం నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, తరేట్ల చింతాలమ్మ, కృష్ణ భగవాన్ , పొట్లూరి రామ్మోహన్‌రావు, బూరా రామచంద్రరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ప్రకాశం నగర్: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద 36 గంటల మహాధర్నా మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ ధర్నాకు మాజీ ఎమ్మెల్సీలు కందుల దుర్గేష్, ఆదిరెడ్డి అప్పారావు, మాజీ ఎంపీ జీవీ హర్ష కుమార్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.అరుణ్, సీపీఎం నగర కార్యదర్శి బి.పవన్ పాల్గొన్నారు.

బీవీపీ ఆవిర్భావ దినోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: భారత్ వికాస్ పరిషత్ (బీవీపీ) 60వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం బొమ్మూరులోని వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలో మొక్కలు నాటారు. జిల్లా కోఆర్డినేటర్ కొత్తపల్లి వీర్రాజు మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చన్నారు. మాజీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎస్ కృష్ణారావు, నేషనల్ ప్రాజెక్టు వైస్ చైర్మన్ సేవ డి.పురుషోత్తమశాస్త్రి మాట్లాడారు.

టీడీపీ నాయకుల సంబరాలు

సీటీఆర్‌ఐ: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర మంగళవారానికి 2 వేల కిలోమీటర్లకు చేరుకున్న నేపథ్యంలో తిలక్ రోడ్డులోని పార్టీ సిటీ కార్యాలయం వద్ద సంబరాలు నిర్వహించారు. అనంతరం పార్టీ శ్రేణులు పాదయాత్ర చేశాయి. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు పాల్గొన్నారు.

సమీకృత సాగుతో అధిక దిగుబడులు

పెదపూడి: రైతులు సమీకృత వ్యవసాయం చేయడంతో తక్కువ పెట్టుబడికి అధిక దిగుబడులు సాధించవచ్చని మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాసు తెలిపారు. ఆయన కైకవోలు గ్రామంలోని సమీకృత వ్యవసాయం చేస్తున్న రైతు పొలాన్ని ఆయన, కాకినాడ సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ పద్మశ్రీ, ఏవో మణిదీప్ పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసు సమీకృత వ్యవసాయానికి సంబంధించిన సూచనలు, సలహాలు రైతులకు అందించారు. ఒక ఎకరం పొలంలో ఫిష్ కల్చర్, వరి, కోళ్ల ఫారం, కూరగాయల సాగు చేపట్టవచ్చని సూచించారు.

సేవా సారథులు.. సంక్షేమ వారధులు

రాజమహేంద్రవరం రూరల్/సీటీఆర్‌ఐ: అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు నూరుశాతం అందాలనే లక్ష్యంతో వలంటీర్ వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాటు చేశారు. వీరి ద్వారా పథకాలను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేసేలా చర్యలు చేపట్టారు. సీఎం ఆకాంక్షకు అనుగుణంగా వలంటీర్లు చిత్తశుద్ధితో సేవలందిస్తున్నారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా తాము ఉన్నామంటూ భరోసా ఇస్తున్నారు. ప్రతినెలా ఒకటో తేదీ వేకువజామునే పింఛన్ల పంపిణీ ప్రారంభిస్తున్నారు. అలాగే వివిధ రకాల సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వలంటీర్లు అందించిన సేవలను కొనియాడుతూ పలువురు లబ్ధిదారులు ఇలా ఆనందం వ్యక్తం చేశారు.

ఇంటి స్థలం మంజూరైంది



గత ప్రభుత్వంలో మా అబ్బాయికి ఇంటి స్థలం కోసం అనేక దరఖాస్తులు అందజేశాం. ఎన్నిసార్లు ఇచ్చినా, నాయకులను కలిసినా ఫలితం లేకపోయింది. సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక వలంటీర్ మా ఇంటికి వచ్చింది. ఇంటి కోసం దరఖాస్తును పూర్తి చేయించి తీసుకువెళ్లింది. అనంతరం 90 రోజుల్లోనే మాకు ఇంటి పట్టాం వచ్చింది. 54 గజాల స్థలం కూడా మంజూరైంది. గతంలో సర్టిఫికెట్లు కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగేవాళ్లం. ఇప్పుడు వలంటీర్లు ఆ సర్టిఫికెట్లకు ఇంటికి తీసుకువచ్చి ఇస్తున్నారు.

– ఉప్పాడ అప్పలరాజు, కాతేరు

సదరమ్ సర్టిఫికెట్ ఇప్పించారు



ఈ బాబు పేరు మొర్తా భానుప్రకాష్. నగరంలోని 42వ డివిజన్ సుభాష్ నగర్‌లోని 79వ సచివాలయం పరిధిలో నివసిస్తున్నాడు. భానుప్రకాష్ దివ్యాంగుడు. అతడిని సదరన్ సర్టిఫికెట్ లేకపోవడంతో పింఛన్ మంజూరు కాలేదు. తల్లి పార్వతి సర్టిఫికెట్ కోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అయితే వార్డు వలంటీర్ దంతాల సురేష్‌బాబు భానుప్రకాష్ ఇంటికి వెళ్లి సమస్య తెలుసుకున్నాడు. వెంటనే సదరన్ సర్టిఫికెట్ వచ్చేలా కృషి చేశాడు. ఇప్పుడు భానుప్రకాష్‌కు పింఛన్ కూడా మంజూరైంది.

– మొర్తా భాను ప్రకాష్, దివ్యాంగుడు

పథకాలపై అవగాహన



గతంలో ప్రభుత్వ పథకాలు ఎన్ని ఉన్నాయో మాకు తెలిసేది కాదు. వలంటీర్ వ్యవస్థ వచ్చాక ప్రతి పథకం గురించి అవగాహన కల్పిస్తున్నారు. వలంటీర్ ద్వారా వైఎస్సార్ చేయూత, జగనన్నతోడు, వైఎస్సార్ ఆసరా, రుణమాఫీ పథకాల లబ్ధి పొందుతున్నాం. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు చేరవేయడంలో వీరికి కీలకపాత్ర. వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి.

– పల్లేటి సత్యవతి, కాతేరు

ఇంటికే పింఛన్



గతంలో పింఛన్ కోసం పంచాయతీ కార్యాలయాల చుట్టూ తిరగలేక ఒళ్లునొప్పులు వచ్చేవి. ఇప్పుడు వలంటీర్ వ్యవస్థ వచ్చిన తరువాత ఒకటో తారీఖు ఉదయాన్నే పింఛన్‌ను ఇంటికి వచ్చి అందజేస్తున్నారు. ప్రతినెలా మా వలంటీర్ వరలక్ష్మి వేకువజామునే రూ.2750 ఇస్తోంది. ఇంకా ఇతర సమస్యలు ఏమైనా ఉన్నాయో తెలుసుకుంటోంది. మా కుటుంబంలో సభ్యురాలిగా మాకు సేవలు అందిస్తోంది.

– తాడి ఎల్లమ్మ, డిబ్లాకు, హుకుంపేట

రాజకీయ లబ్ధికోసమే పవన్ వ్యాఖ్యలు



వేమగిరిలో పవన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు



హుకుంపేట డిబ్లాకులో నిరసన తెలుపుతున్న వలంటీర్లు

- వలుచోట్ల వలంటీర్ల నిరసన
- వేమగిరిలో పవన్ దిష్టిబొమ్మ దహనం

కడియం: జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ రాజకీయ లబ్ధి కోసమే వలంటీర్లపై నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారని వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం వేమగిరిలో నిరసన తెలిపారు. తన స్వార్థం కోసం ఇంత దిగజారుడు మాటలు మాట్లాడే నాయకుడిని ఎక్కడా చూడలేదన్నారు. కోవిడ్ సమయంతో పాటు ఇప్పటి వరకూ వలంటీర్లు ఎన్నో సేవలు అందిస్తున్నారన్నారు. పవన్ తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని, బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వేమగిరి జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి, పవన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారికి మద్దతుగా రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ కార్యదర్శి బడుగు ప్రశాంతకుమార్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మద్దాల అను, పెయ్యల రాజేష్, కట్టా సత్య సురేష్, గుబ్బల నాగార్జున, గోలి దేవా, రేగుళ్ల రాజు, పితాని శ్రీను, తలారి ప్రసాద్, హమీద్ బాషా, పిల్లి సుబ్రహ్మణ్యం, యనమదల మణికంఠ, సాపిరెడ్డి కామేష్, పుట్టా పరేష్, మత్సేటి శివ, చెల్లాయమ్మ, తోడేటి రాజా, సోమన శ్రీను, వాలంటీర్స్ అసోసియేషన్ కడియం మండల అధ్యక్షులు పలివెల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: సేవాదృక్పథంలో గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సేవలందిస్తున్న వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. మంగళవారం హుకుంపేట డిబ్లాకు రావిచెట్టు సెంటర్‌లో గ్రామ సచివాలయం–2 వలంటీర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సందిపర్తి లావణ్య, పిట్టా ఇజ్రాయేలు మాట్లాడుతూ అర్హులకు సంక్షేమ పథకాలను గడప వద్దకే అందించాలన్న ఏకైక లక్ష్యంతో సీఎం జగన్ మోహన్‌రెడ్డి గ్రామసచివాలయం, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చారన్నారు. ఆయన ఆశయానికి అనుగుణంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు గుత్తుల విజయలక్ష్మి, సూరంపూడి నాని, బోను సాయి, లహరిక పాల్గొన్నారు.

ప్రజలందరికీ సురక్షిత నీరు

- ఎంపీ భరత్ రామ్
- వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన



రచ్చబండలో సమస్యలు వింటున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజలందరికీ సురక్షిత తాగునీరు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. నగరంలోని 9వ డివిజన్ మున్సిపల్ పార్కులో వాటర్ ట్యాంకు నిర్మాణానికి మంగళవారం సిటీ కోఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2.9 లక్షలతో ఈ ట్యాంకు నిర్మిస్తున్నారు. ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ ఈ ట్యాంకు నిర్మాణం వల్ల 9, 10 డివిజన్లకు సమృద్ధిగా నీరు అందించవచ్చన్నారు. కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఏవార్డులోనూ మంచినీటి సమస్య ఉండకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎస్ఈ పాండురంగారావు, ఈఈ కనకారావు, డీఈ చంద్రశేఖరరావు, ఏఈ భవాని, 9వ డివిజన్ ఇన్‌చార్జి దాసి వెంకట్రావు, పార్టీ నాయకులు సంకిస భవానీ ప్రియ, పోలు విజయలక్ష్మి, మజ్జి అప్పారావు, పాలిక శ్రీను, నక్కా శ్రీనగేష్, 1, 2 డివిజన్ ఇన్‌చార్జులు ముప్పన ప్రభాకర్, మానే దొరబాబు పాల్గొన్నారు.

రచ్చబండలో సమస్యల వినతి

రాజమహేంద్రవరం రూరల్: ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆధ్వర్యంలో వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలో మంగళవారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. రాజమహేంద్రవరం మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు తరలివచ్చి తమ సమస్యలను వివరించారు. వెంటనే ఎంపీ ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహంతో మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలికుల గాండ్ల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సంకిస భవానీ ప్రియ, పాలిక శ్రీను, మార్గాని సురేష్, ఎన్వీ శ్రీనివాస్, పోలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రతి సమస్యకూ సత్వర పరిష్కారం



వీరవరంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

కడియం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలకు వెనువెంటనే పరిష్కారం లభిస్తోందని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. ఆయన మండలంలోని వీరవరంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని, స్థానికులకు వివిధ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి రాధాకృష్ణ, ఎంపీడీవో రత్నకుమారి, వైఎస్సార్‌సీపీ రాష్ట్రకార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి, పార్టీ నాయకులు బత్తుల రాము, రేమళ్ల హరీష్, దొంతంశెట్టి చినవీర్రాజు, వేమగిరి మాజీ సర్పంచ్ వెలుగుబంటి వెంకటాచలం, పి. దేవానందం పాల్గొన్నారు.

- పొట్టిలంకలో జరిగిన కార్యక్రమంలో ప్రత్యేకాధికారి వి.రాధాకృష్ణ, శాప్‌డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, సర్పంచ్ కొత్తపల్లి సత్యవతీ వేంకటేశ్వరరావు, పార్టీ నాయకులు ఈలి శ్రీను, కొత్తపల్లి సత్యనారాయణ, గట్టి గంగాధర్, తహసీల్దార్ ఎం.సుజాత పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: నగరపాలకసంస్థ పరిధిలోని 45, 46, 47 వార్డు సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న చందన నాగేశ్వర్ వివిధ రకాల సర్టిఫికెట్లను అందించారు. రాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర, అంగాడ సత్యప్రియ, దుంపా చంద్రారెడ్డి, దమ్ము ప్రసాద్, అన్నపూర్ణ రాజు, ఇమామ్, కామరాజు పాల్గొన్నారు.

- కాతేరు సచివాలయం–2లో ఎంపీడీవోడి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 1,631 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. మండల ప్రత్యేకాధికారి, జిల్లా గిరిజిన సంక్షేమాధికారి కేఎస్ జ్యోతి, డిప్యూటీ తహసీల్దార్ రత్నసాగర్, పంచాయతీ కార్యదర్శి హనుమంతరావు పాల్గొన్నారు.
- శాటిలైట్ సిటీ సచివాలయం–2లో తహసీల్దార్ పైడి చిన్నారావు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు.

మహిళపై ఉన్మాది దాడి



దుర్గానగేష్‌ను స్తంభానికి కట్టేసిన స్థానికులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రావణి

కడియం: కడియంలోని యూనియన్ బ్యాంకు ఎదురుగా గల బేకరీలో పనిచేస్తున్న ఒక మహిళపై ఉన్మాది విచక్షణా రహితంగా దాడి చేశాడు. మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. వీరవరం గ్రామానికి చెందిన శ్రావణి కడియంలో నివాసం ఉంటూ బేకరీలో పనిచేస్తోంది. ఎప్పటిలాగే తన పిల్లలను స్కూలు నుంచి తీసుకువచ్చి బేకరీలో కూర్చోబెట్టి పనిచేసుకుంటోంది. పొట్టిలంక గ్రామానికి చెందిన తోరాటి దుర్గానగేష్ హఠాత్తుగా బేకరీలోకి వచ్చాడు. వచ్చీ రావడంతోనే తన కూడా తెచ్చుకున్న స్టిక్కరింగ్ బ్లేడ్‌తో శ్రావణిపై దాడి చేశాడు. దీంతో ఆమె చేతులు, కాళ్లపై గాయాలయ్యి, రక్తస్రావం జరిగింది. శ్రావణిపై దాడి చేసిన అనంతరం తాపీగా నడుచుకుంటూ బయటకు వెళ్లిపోయాడు.

నిందితుడికి దేహశుద్ధి

స్థానికులు వెంటనే దుర్గానగేష్‌ను పట్టుకుని అక్కడే ఉన్న స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. నిందితుడు మద్యం మత్తులో ఉన్నాడని స్థానికులు చెబుతున్నారు. శ్రావణిని వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ ఆమె చికిత్స పొందుతోంది. రెండు చేతులు, కాళ్లపై ఉన్న కత్తిగాయాలకు కుట్లు వేసి వైద్యులు అబ్జర్వేషన్‌లో ఉంచారు. ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు చెప్పారని కడియం ఎస్ఐ శివాజీ తెలిపారు. ఆయన ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. దుర్గానగేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. కాగా.. శ్రావణి తన భర్త నుంచి విడిగా ఉంటూ, బేకరీలో పనిచేసి పిల్లలను పోషించుకుంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

నర్సరీ పాలకవర్గం ఎన్నిక ఏకగ్రీవం

- చెరిసగం రోజులకు కుదిరిన ఒప్పందం
- ఐక్యత చాటిన రైతులు



నూతన పాలకవర్గాన్ని అభినందిస్తున్న నర్సరీ రైతులు

కడియం: సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ పాలకవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. దేశంలోనే అతి పెద్దదైన ఈ అసోసియేషన్ పాలకవర్గం ఎన్నికపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. నర్సరీ రైతులు ఐకమత్యంతో ఉంటారన్న దానిని మరోసారి నిజం చేస్తూ ప్రస్తుత పాలకవర్గం ఎన్నిక ఏకగ్రీవం చేశారు. ఇందుకోసం నర్సరీ రంగంలోని పెద్దలు విశేష కృషి చేశారు. నాలుగు రోజులుగా ఎన్నికల వేడి రగిలింది. సాధారణ ఎన్నికల మాదిరిగా జన సమీకరణలతో అభ్యర్థులు ప్రచారానికి సిద్ధమయ్యాయి. బలప్రదర్శనలు ఊపందుకున్నాయి. అయితే పాలకవర్గం ఎన్నిక ఏకగ్రీవమైతే బాగుంటుందన్న భావన సర్వత్రా వ్యక్తమైంది. ఒకరిద్దరు ముఖ్యుల పేర్లు విన్పించినప్పటికీ నామినేషన్లు వేసేందుకు వారు ముందుకు రాలేదు. దీంతో నిర్ణీత సమయానికి నామినేషన్లు వేసిన మల్లు పోలరాజు, రత్నం అయ్యప్ప, పెనుమాక బుల్లికొండయ్యలతో నర్సరీరంగ పెద్దలు చర్చించారు. మరో నామినేషన్ రత్నం దొరబాబు.. అయ్యప్పకు డమ్మీగా వేయడంతో ఆ నామినేషన్‌ను మినహాయించారు. దీంతో ప్రధానంగా ముగ్గురు అభ్యర్థులతోనూ దాదాపు ఐదు గంటల పాటు నిర్వహించిన చర్చలతో ఏకగ్రీవం వైపు అందరూ మొగ్గు చూపించారు. వివిధ ప్రతిపాదనలు ముందుకు వచ్చినప్పటికీ మూడేళ్ల పదవీ కాలాన్ని మల్లు పోలరాజు, రత్నం అయ్యప్పకు చెరిసగం రోజులు ఇవ్వడానికి అందరూ ఆమోదించారు. పెనుమాక బుల్లికొండయ్యకు ఉపాధ్యక్ష పదవిని కూడా ఇదే రీతిలో ఇచ్చేందుకు ప్రతిపాదించారు.

డ్రాతో నిర్ణయం

చెరిసగం రోజులు పదవిలో ఉండేందుకు అభ్యర్థులు అంగీకరించిన నేపథ్యంలో ఎవరు ముందు చేయాలన్న అంశం తెరపైకి వచ్చింది. ఈ నిర్ణయాన్ని డ్రా ద్వారా తేల్చేందుకు ఎన్నికల కమిటీ, అభ్యర్థులు, నర్సరీ రంగ ప్రముఖులు ఏకాభిప్రాయానికి వచ్చారు. ఈ డ్రాలో మల్లు పోలరాజుకు తొలి విడత (18 నెలలు) అవకాశం దక్కింది. ఆ తరువాత రత్నం అయ్యప్ప (18 నెలలు) అధ్యక్షుడిగా పనిచేస్తారు. దీంతో సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షుడిగా మల్లు పోలరాజును ప్రకటించారు. అలాగే పదవీ కాలం పూర్తయ్యాక రత్నం అయ్యప్పకు బాధ్యతలు అప్పగించే అంశంపై కూడా పెద్దల సమక్షంలో ఒప్పందం జరిగింది.

డైరెక్టర్లకూ అంగీకారం

మొత్తం 11 మంది డైరెక్టర్లకు గాను ఆరు డైరెక్టర్ స్థానాల్లో అభ్యర్థులు మూడేళ్ల పాటు పదవీ బాధ్యతలు నిర్వహించేందుకు అంగీకారం కుదిరింది. మిగిలిన 5 స్థానాల్లోనూ పోటీలో ఉన్న అభ్యర్థులు చెరిసగం రోజులు పదవిలో ఉండేందుకు అంగీకరించారు. ముందు ఎవరు బాధ్యతలు చేపట్టాలి అన్నదానిపై డ్రా నిర్వహించి నిర్ణయించారు. దీంతో ఎన్నికల హడావిడి లేకుండా పాలకవర్గం మొత్తం ఏకగ్రీవంగా నిర్ణయించారు. రాజకీయాలకు అతీతంగా ఏకగ్రీవానికి అందరూ కట్టుబడి ఉండడంతో నర్సరీ రైతుల ఐకమత్యం మరోసారి చాటిచెప్పినట్లయింది. ఇదిలా ఉండగా నర్సరీ రంగం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని నర్సరీ అసోసియేషన్ అధ్యక్షులు మల్లు పోలరాజు తెలిపారు. ఈ సందర్భంగా నూతన పాలక వర్గాన్ని పలువురు రైతులు అభినందించారు.

జపయజ్ఞాన్ని విజయవంతం చేయాలి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సత్యసాయిబాబా శతజయంతి 2025 నవంబర్ 23 నాటికి 108 కోట్ల సత్యసాయి లిఖితనామ మహాజపయజ్ఞాన్ని భక్తిశ్రద్ధలతో సమైక్యంగా విజయవంతం చేయాలని సత్యసాయి సేవాసంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు పిలుపు నిచ్చారు. స్థానిక ఆల్కాట్ గార్డెన్స్‌లోని సత్యసాయి భజన మందిరంలో మంగళవారం జరిగిన జిల్లా పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరంతర ఆధ్యాత్మిక సాధనకు లిఖిత నామ యజ్ఞం ఎంతో ఉపయోగపడుతుందని రాజమహేంద్రవరం సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ అయోధ్యల శ్యామసుందర్ అన్నారు. మహాయజ్ఞానికి సంబంధించిన ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో లిఖిత నామ పుస్తకాలను సబ్‌జోన్ కన్వీనర్లకు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మందిరం అధ్యక్షుడు దండమూడి గిరిధర్, కార్యదర్శి గంటా హనుమంతరావు, జిల్లా ఆధ్యాత్మిక సమన్వయకర్త ఎస్‌వీ సాయిరామ్, సేవాదళ్ సమన్వయకర్తలు రోహిణి కుమార్, రామలక్ష్మి పాల్గొన్నారు.

విగ్రహాల ధ్వంసం

కడియం: మండల కేంద్రమైన కడియంలోని బస్టాండ్ సమీపంలోని మహాత్మాగాంధీ, మూడు సింహాల విగ్రహాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. స్థానికులు ఈ విషయాన్ని మంగళవారం రాత్రి గమనించి, స్థానిక నాయకుల ద్వారా పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కంబాలచెరువు: మద్యం మత్తులో అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఏవీ అప్పారావు రోడ్డుకు చెందిన పి.నవీన్ (35) చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. నవీన్ మద్యం తాగుతుండడంతో అతడి భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఇదిలావుండగా ఈనెల 3వ తేదీన ఇంటిలో అపస్మారక స్థితిలో పడి ఉన్న నవీన్‌ను అతని తమ్ముడు ఆసుపత్రిలో చేర్పించాడు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

చోరీ కేసులో ఏడాది జైలు

రాజానగరం: స్థానిక పోలీసు స్టేషను పరిధిలోని కొంతమూరులోని ఒక ఇంటిలో దొంగతనం చేసిన కొండేటి నాగసాయికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ రాజమహేంద్రవరం ప్రిన్సిపల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్.శ్రీలక్ష్మి మంగళవారం తీర్పునిచ్చారు. ఎస్సై వై.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొంతమూరులోని నందూరి భాస్కరరావు ఇంట్లో 2020 మార్చిలో దొంగతనం జరిగింది. బంగారు, వెండి వస్తువులతోపాటు కొంత నగదును దొంగలు అపహరించారు. దర్యాప్తు అనంతరం కొండేటి నాగసాయిని అరెస్టు చేసి, అప్పటి ఎస్సై నాగబాబు కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారన్నారు. విజయ్‌కుమార్ ఏపీపీగా వాదించారు.